క్లుప్తంగా

నేడు హుండీల లెక్కింపు

మధురపూడి: కోరుకొండలో వేంచేసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలోని హుండీల లెక్కింపు సోమవారం నిర్వహించనున్నట్టు దత్తత అన్నవరం దేవస్థానం కార్య నిర్వాహణాధికారి వి.త్రినాథరావు తెలిపారు. ఉదయం పది గంటలకు హుండీల లెక్కింపు ప్రారంభమవుతుందని చెప్పారు.

హైందవ శంఖారావానికి తరలి రావాలి



దివాన్‌చెరువులో సమావేశమైన యువకులు

రాజానగరం: విజయవాడలో వచ్చే నెల ఐదున జరిగే హైందవ శంఖారావానికి భారీగా తరలిరావాలని కార్యక్రమ దివాన్‌చెరువు గ్రామ ప్రముఖ్ వీరాతి నాగు విజ్ఞప్తి చేశారు. దివాన్‌చెరువు నుంచి సుమారు 500 మంది తరలివెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఆదివారం జరిగిన సమావేశంలో హైందవ శంఖారావాన్ని విజయవంతం చేసేవిధంగా ఒక కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో నాగు గ్రామ ప్రముఖ్ కాగా, జనపరెడ్డి ప్రసాద్ బస్ ప్రముఖ్, గాంగేయుడు, నీలపాల శివ, పలివెల నవీన్‌లు గ్రామ జట్టుగా ఎంపికయ్యారు. కర్రి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సత్యనారాయణరాజు, గ్రంధి గణేష్ గుప్త, నీలపాల శ్రీను, కడియం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సూర్యదేవుడికి ప్రత్యేక పూజలు



జి.మామిడాడలో ప్రత్యేక అలంకరణలో సూర్యదేవుడు, దేవేరులు

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలో ప్రసిద్ధి చెందిన ఉషా, చాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యనారాయణ మూర్తి ఆలయంలో స్వామి వారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు వెంకట నరసింహాచార్యులు, మరికొంత మంది అర్చకులు ఉదయం స్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.

పద్మశాలీయులకు అండగా నిలుస్తాం

పెదపూడి: రాష్ట్రంలో ఏ పద్మశాలీ కుటుంబానికి కష్ట మొచ్చినా సహాయ కార్యక్రమాలను నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ పద్మశాలీ యువసేన కృషి చేస్తుందని పలువురు ఏపీపీవైఎస్ ప్రతినిధులు పేర్కొన్నారు. అనపర్తిలో ఏపీపీవైఎస్ ప్రతినిధులు ఆదివారం మాట్లాడారు.పద్మశాలీ కుటుంబాల్లోని పేద విద్యార్థుల చదువులు కొనసాగేందుకు బాసటగా నిలిచేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీపీవైఎస్ ప్రతినిధులు గోపిశెట్టి రామాంజనేయులు రుషి, మునగపాటి రమేష్, పెనుగొండ శ్రీనివాసరావు, గోలి వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మురుగు కాలువను తలపిస్తున్న చాగల్నాడు ప్రధాన కాలువ



సూర్యారావుపేట వద్ద చాగల్నాడు కాలువలోకి చేరుతున్న కెమికల్ వ్యర్థాలు

రబీకి గోదారి ఏదీ..!?

- ప్రక్షాళనకు నోచుకోని చాగల్నాడు కాలువ
- మురుగు మయంగా మారుతున్న వైనం
- పంట సాగుకు ఇంకా అందని నదీ జలాలు

రాజానగరం: సాగునీటి సదుపాయాలు లేని మెట్ట ప్రాంతంలోని చాగల్నాడుకు గోదావరి జలాలను అందించి, ఇక్కడి భూములను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో నిర్మించిన చాగల్నాడు ఎత్తిపోతల పథకానికి చెందిన ప్రధాన కాలువ మురుగు కోడుగా మారుతోంది. కాలువ ప్రక్షాళనకు నోచుకోకపోవడంతో చుట్టూ అపరిశుభ్రత వాతావరణం పెరిగి, పంట కాలువ కాస్తా మురుగు కాలువగా దర్శనమిస్తోంది. ఈ క్రమంలో ప్రతి ఏటా రబీ పంట ప్రారంభంలో సాగు నీటిని అందించే ఈ కాలువ నుంచి నేడు ఆ ఛాయలేవీ కనిపించడం లేదు సరికదా, మురుగు నీటితో దుర్గంధభరితంగా మారింది.

పూడుకుపోయిన ప్రధాన కాలువ

ప్రస్తుతం చాగల్నాడు ప్రధాన కాలువ చాలావరకు పూడుకుపోయి, మేజర్ డ్రెయిన్‌గా మారిపోయింది. జీఎస్‌ఎల్ వైద్య కళాశాల, జనరల్ ఆస్పత్రుల నుంచి వెలువడే రసాయన వ్యర్థాలతో పాటు, ఆ పరిసరాలలోని అపార్టుమెంట్ల నుంచి వదిలే మురుగు నీరు ఈ కాలువలోకి ధారాళంగా ప్రవహిస్తోంది. దీంతో పంట కాలువ కాస్తా మురుగు కాలువగా దర్శనమిస్తోంది. అంతేకాక కాలువకు ఇరువైపులా అపరిశుభ్రత పెరిగిపోయి, పిచ్చి మొక్కలు, గడ్డి మొలిచి కాలువ చాలావరకు కుచించుకుపోయింది. ఇక కాలువ గట్టు పరిస్థితిని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అసలు కాలువ గట్టే లేనట్టుగా పరిసరాలు పూర్తిగా ఆక్రమణల చెరలో చిక్కుకున్నాయి. సంబంధిత అధికారులు ఇకనైనా స్పందించి చాగల్నాడు ప్రధాన కాలువ నుంచి రబీ సీజన్‌కు నీటిని వదలడంతో పాటు, కాలువను ప్రక్షాళన చేయడం, ఆక్రమణలను తొలగించడం వంటి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రబీ పంటకు నీరేది?

చాగల్నాడు ప్రాంతంగా పిలువబడే రాజానగరం, రంగంపేట, రాజమహేంద్రవరం రూరల్, కోరుకొండ మండలాలతో పాటు, పరిసరాలలోని అనపర్తి, బిక్కవోలు, మండపేట మండలాల్లో 35 వేల ఎకరాలకు సాగు నీరు, వేసవిలో 35 గ్రామాలకు తాగునీరుగా గోదావరి జలాలను అందించే విధంగా చాగల్నాడు ఎత్తిపోతల పథకాన్ని 2002 ఫిబ్రవరిలో ప్రారంభించారు. అయితే ఆ సమయంలో నిర్మించిన ప్రధాన కాలువతో పాటు, పిల్ల కాలువను అభివృద్ధి చేయకపోవడంతో ప్రారంభం నుంచి 35 వేల ఎకరాల లక్ష్యాన్ని ఈ పథకం చేరుకోలేదు. ప్రారంభంలో ఖరీఫ్ సీజన్‌లో 22 వేల ఎకరాలకు సాగు నీటిని సరఫరా చేసినా కానీ, ఆపై అది 15 వేల ఎకరాలకు కూడా చేరని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ తరుణంలో రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ పథకం అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. ఖరీఫ్ సీజన్‌లోనే కాకుండా రబీ సీజన్ ప్రారంభంలో వరి నారుమడులు కట్టుకునేందుకు, నాట్లు వేసుకునేందుకు వీలుగా కొన్ని రోజుల పాటు ఈ పథకం ద్వారా గోదావరి జలాలను విడిచిపెట్టేవారు. అయితే ఇటీవల జరిగిన ఎన్నికలలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో.. రబీ పంటకు నీరివ్వాలనే విషయాన్ని అధికారులు కూడా వదిలేసినట్టున్నారు. కొన్ని ప్రాంతాలలో ఇప్పటికే రబీ సాగుకు నార్లు కట్టి, నాట్లు కూడా వేస్తున్నారు. ఈ తరుణంలో చాగల్నాడు కాలువ నుంచి గోదావరి జలాలను ఎప్పుడు వదులుతారా అని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

రబీకి నీరు వదలాలి



గడచిన ఐదేళ్లలో రబీ సీజన్‌లో వరి పంటను సాగు చేయడం కోసం రైతులకు సాగు నీటి ఇబ్బందులు లేకుండా వైఎస్సార్ సీపీ సర్కారు కొన్ని రోజుల పాటు చాగల్నాడు ప్రధాన కాలువ నుంచి గోదావరి జలాలను వదిలింది. మరి ఆ సంప్రదాయాన్ని కూటమి ప్రభుత్వం ఎందుకు పాటించటం లేదో తెలీదు కానీ ప్రస్తుతం సాగునీటి కోసం రబీ పంటసాగును చేపట్టిన రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని, సత్వరమే చాగల్నాడు కాలువ నుంచి గోదవరి జలాలను విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలి.

– దూలం పెద్ద, మండల కన్వీనర్, వైఎస్సార్ సీపీ, రాజానగరం


మురుగు కాలువగా మారనివ్వకండి



చాగల్నాడు కాలువను మురుగు కాలువగా మారకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఈ కాలువ ద్వారా పంట భూములకు గోదావరి జలాలను అందించడమే కాకుండా వేసవిలో 35 గ్రామాల ప్రజలకు తాగునీటిని అందించే ఈ కాలువ మురుగు మయమైతే, ఆ నీటిని తాగే ప్రజలు ఏమైపోతారో ఒక్కసారి ఆలోచించాలి.

– ఆనందరావు, వక్కలంక, ఎస్టీ రాజాపురం


14న ఆంజనేయస్వామి తీర్థ మహోత్సవం



రంగంపేటలో కొలువుదీరిన అభయాంజనేయ స్వామి

రంగంపేట: మండల కేంద్రం రంగంపేట గ్రామంలో కొలువుదీరిన అభయాంజనేయ స్వామి వార్షిక తీర్థ మహోత్సవాన్ని ఈ నెల 14న నిర్వహించడానికి అభయాంజనేయ ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. 14వ తేదీ శనివారం స్వామివారికి అభిషేకాలు, తమలపాకులు, సింధూరంతో పూజలు నిర్వహిస్తారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు, తీన్‌మార్‌తో పాటు బాణాసంచా పోటీలు నిర్వహిస్తారు. పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను ఆలయ కమిటీ నిర్వాహకులు అందిస్తారు.

కోరుకొండలో షష్ఠి సందడి



కోరుకొండ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి ఉత్సవాల్లో విద్యుద్దీపాలంకరణ

మధురపూడి: కోరుకొండలో వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాల రెండో రోజు ఆదివారం సందడి నెలకొంది. ఉదయం స్వామి వారికి అభిషేకాలు జరిగాయి. భక్తులు స్వామిని దర్శించుకున్నారు. సెలవు రోజు కావడంతో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. ఉత్సవాల సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ ఆకట్టుకుంది. రాత్రి స్థానిక స్వామివారి కల్యాణ మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. పాలకొల్లు వారి ఆర్కెస్ట్రా అందర్నీ ఆకట్టుకుంది.

పంట కోతలు పూర్తి

కడియం: మండల పరిధిలో వరి పంట కోతలు పూర్తయ్యాయని వ్యవసాయాధికారి కె.ద్వారకాదేవి తెలిపారు. కడియం, జేగురుపాడు, మురమండ గ్రామాల్లో సుమారు 150 ఎకరాలు మాత్రమే ఇంకా కోయాల్సి ఉందన్నారు. ఊడ్పుల సమయంలో వచ్చిన భారీ వర్షాల కారణంగా ఆయా గ్రామాల్లో నాట్లు దెబ్బతిన్నాయని, వాటిని తిరిగి ఊడ్చడంతో ప్రస్తుతం కోతలు ఆలస్యమైనట్లు ఏవో వివరించారు. దాళ్వాలో మండలవ్యాప్తంగా 1121 రకాన్నే రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం నారుమడుల పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఓపెన్ మార్కెట్‌లో అమ్ముకునేందుకు బొండాలు రకాన్ని కూడా పలువురు రైతుల సాగు చేస్తున్నట్లు చెప్పారు.







నృత్య రూపకంలో అలరించిన భంగిమలు

రసవత్తరం.. భామాకలాపం..



ప్రకాశం నగర్: గోదావరి తీరాన ఆదివారం సాయంత్రం నవ జనార్దన పారిజాతం నృత్య రూపకం నగరవాసులను అలరించింది. స్థానిక ఆనం కళాకేంద్రంలో నాట్యాచార్య ఆచంట చంద్రశేఖర్ శిష్య బృందం నుంచి తొమ్మిది మంది సత్యభామలు ఒక వేదిక్పై భామా కలాపాన్ని ప్రదర్శించారు. అతి పురాతన నాట్యమైన నవ జనార్దన పారిజాతం నృత్య రూపకాన్ని ప్రదర్శించిన కళాకారులు తమ అద్భుత ప్రదర్శనతో ఆహూతులను మంత్రముగ్ధుల్ని చేశారు. పూర్వకాలంలో జనార్దన స్వామి ఆలయంలో దేవాదాసీలు చేసే నాట్యంగా ప్రసిద్ధి చెందినదని నాట్యాచార్యుడు చంద్రశేఖర్ చెప్పారు. పవిత్ర గోదావరి తీరాన తొమ్మిది జనార్దన స్వామి ఆలయాల్లో సత్యభామ సమేతుడై స్వామివారు కొలువుదీరి ఉండడం వల్ల సత్యభామ చేసే కలాపాలకు నవ జనార్దన పారిజాతం అనే పేరు వచ్చిందని తెలిపారు. అటువంటి నృత్య రూపకాన్ని ప్రదర్శించడం అదృష్టంగా ఆయన అభివర్ణించారు.

ఆత్మీయ సమావేశం

ప్రకాశం నగర్: ఆంధ్రప్రదేశ్ పేపర్ మిల్లు రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసి 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం స్థానిక ఆనంద్ రీజెన్సీ వేదికగా ఆత్మీయ సమావేశం నిర్వహించారు. 1964 నుండి పేపర్ మిల్లులో పనిచేసి, ఉద్యోగ విరమణ చేసిన అధికారులు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. విశ్రాంత అధికారులు పేపర్ మిల్లుతో, నగరంతో తమ అనుబంధాలు, అనుభవాలను గుర్తు చేసుకున్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

రాజమహేంద్రవరం రూరల్: రాజవోలు రమాదేవి గార్డెన్స్‌లో శనివారం రాత్రి రాజమండ్రి డివిజన్ ఎంప్లాయీస్, ఆలిండియా ఎస్సీ, ఎస్టీ కాన్ఫెడరేషన్(న్యూఢిల్లీ), ఏపీ ప్రేయర్ టీం ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాన్ఫెడరేషన్ రాజమండ్రి శాఖ అధ్యక్షుడు చింతా సురేష్ నేతృత్వంలో జరిగిన ఈ వేడుకలో ముఖ్యఅతిథిగా విద్యా శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.అబ్రహాం హాజరై, క్రిస్మస్ కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలిపారు. ప్రముఖ దైవజనులు ఎంఎస్ సునీల్‌వర్ధన్ క్రిస్మస్ సందేశాన్ని అందించారు. మానవాళిపై దేవునికి ఉన్న ప్రేమ, ప్రణాళిక గొప్పదని, వారి రక్షణ కోసమే ఏసుక్రీస్తు ఈ లోకానికి వచ్చారన్నారు. విశ్రాంత ప్రొఫెసర్ డా.ఆర్ నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలలో 13 ఏళ్లుగా క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్న చింతా సురేష్‌ను ఉద్యోగులు అభినందించారు.

బిక్కవోలు మండలంలోని అధికారులు వివరాలు

పేరు	హోదా	ఫోన్ నంబర్
వి. శ్రీనువాస్	ఎంపీడీవో	9848496088
ఎస్.జాన్ మిల్టన్	పంచాయతీ విస్తరణాధికారి	9110394865
–	తహసీల్దార్	9849903913
బీబీఎస్‌వీవీ కృష్ణ	డిప్యూటీ తహసీల్దార్	9866484845
యువై రత్నం	అసిస్టెంట్ ఇంజినీర్, పంచాయతీరాజ్	7036977405
ఎన్ సామ్యూల్ జాన్	వ్యవసాయ శాఖ ఏవో	8331056572
సీహెచ్‌వీవీ సత్యనారాయణ	మండల విద్యాశాఖ-1	9394222224
కె.పూర్ణచంద్రరావు	మండల విద్యాశాఖ -2	7981174295
కె.సాయి కుమార్	ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్	9111199576
రాంబాబు	ఏఈ, రోడ్డు భవనాల శాఖ	6301327292
ఏ.సరోజి	ఏఈఈ, నీటి పారుదల శాఖ, బిక్కవోలు	9885133949
కె.బుజ్జిదొర	ఏఈ, విద్యుత్ శాఖ	9440812650
వి.వనమయ్య	ఏఈ, హౌసింగ్	7093930486
వి.రవిచంద్ర కుమార్	ఎస్సై	9440904851
డాక్టర్ ప్రణీత్	వెటర్నరీ వైద్యులు, బిక్కవోలు	9494240289
డాక్టర్ దుర్గాదేవి	పీహెచ్‌సీ వైద్యులు, బిక్కవోలు	8008540157
డాక్టర్ విజయలక్ష్మి	పీహెచ్‌సీ వైద్యులు, కొంకుదురు	6303221241
అగస్టీన్	ఏపీవో ఉపాధిహామీ	7093998252
టి.సుప్రియ	ఏపీఎం వెలుగు	7993325064
శాంతి	ఐసీడీఎస్ సూపర్‌వైజర్, బిక్కవోలు	9177060757
కృష్ణవేణి	ఐసీడీఎస్ సూపర్‌వైజర్, ఊలపల్లి సెక్టార్	6305213882
జెర్సీ ఫోరెన్స్	ఐసీడీఎస్ సీడీపీవో, రంగంపేట ప్రాజెక్టు	9491051561
ఎస్.ప్రభు కృష్ణ,	ఏఎస్‌ఓ	9493789131

భక్తిప్రపత్తులతో ఖకార్షా ఔలియా ఉరుస్



దర్గాలో ఖకార్షా ఔలియా సమాధి



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ముజావర్ అల్లాబక్ష్ తదితరులు



దర్గా నుంచి గంధాన్ని తీసుకువెళుతున్న భక్తులు



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



సంప్రదాయబద్ధంగా ఊరేగింపులో తీసుకువెళుతున్న గుర్రం

- ఘనంగా 297వ గంధోత్సవం
- వివిధ ప్రాంతాల నుంచి భారీగా హాజరైన భక్తులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నగరంలోని ప్రధాన రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గంలో ఇన్నీసుపేట ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల సమీపాన ఉన్న ఖకార్షా ఔలియా దర్గాలో ఉరుస్ ఉత్సవంలో భాగంగా కీలకమైన గంధోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. కులమతాలకు అతీతంగా, దూర ప్రాంతాల నుంచి సైతం భక్తులు భారీగా హాజరయ్యారు. దర్గా కమిటీ ఆర్గనైజర్, ముజావర్ షేక్ అల్లాబక్ష్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు సంప్రదాయబద్ధంగా కొనసాగాయి. ఉదయం నుంచి భక్తులు దర్గాకు హాజరై, ప్రార్థనలు నిర్వహించారు. మధ్యాహ్నం దర్గా వద్ద నుంచి గంధాన్ని గుర్రం, ఫకీర్ల మేళాలతో ఊరేగింపు చేపట్టారు. తాడితోట, దానవాయిపేట, జాంపేట మీదుగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఊరేగింపు నిర్వహించి, సాయంత్రానికి తిరిగి దర్గాకు చేరుకుంది. అక్కడ గంధాన్ని ఉంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా దర్గా ప్రాంగణంలో ఉదయం, సాయంత్రం మహాన్నదానం ఏర్పాటు చేశారు. దర్గా వద్ద ఐదు ప్రదక్షిణలు చేస్తే, కష్టాల నుంచి బయట పడతారన్న విశ్వాసం.మేరకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ముజావర్లు షేక్ మదీనాపాషా. షేక్ హుస్సేన్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మంచు కురిసే వేళలో..



రంగంపేట మండలంలో దట్టంగా అలముకున్న పొగమంచు

రంగంపేట: శీతాకాలం కావడంతో తెల్లవారు జామున రహదారులపై పొగమంచు కమ్మేస్తోంది. ఉదయం ఏడు గంటలు దాటినా ఎదురుగా ఏ వాహనం వస్తోందో తెలుసుకోలేనంతగా మంచు కురుస్తోంది. ఈ మధ్యకాలంలో ఎప్పుడూ లేనంతగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణించాల్సి వస్తుంది. ప్రజలు ఉదయాన్నే బయటకు రావడానికి జంకుతున్నారు. గ్రామాల్లో చలి మంటలు వేసుకుంటున్నారు. మండలంలోని వడిశలేరు, రంగంపేట, చంద్రేడు, పెదరాయవరం తదితర గ్రామాల్లో వేసే శనగ పంటకు ఈ పొగమంచు ఎంతో ఉపయోగపడుతుందని రైతులు చెబుతున్నారు.